క్లుప్తంగా

బూర్జ వెలుగు సీసీగా మరడాన కృష్ణ



సీతానగరం: మండలంలోని వెలుగు మండల సమాఖ్య బూర్జ సీసీగా మరడాన కృష్ణను నియమిస్తూ డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయని ఏపీఎం రెడ్డి శ్రీరాములు తెలియ జేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ బూర్జ సీసీగా ఇంతవరకూ సేవలందించిన కోటీశ్వరరావు మరో క్లస్టర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మరడాన కృష్ణ విధుల్లో చేరినట్లు తెలిపారు. సీసీ కృష్ణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సహకారంతో పొదుపు సంఘాల సభ్యులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిచడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయ సిబ్బంది సీసీ కృష్ణను అభినందించారు.

త్వరితగతిన సర్వే రాళ్ల ఏర్పాటు

- ఆర్డీఓ హేమలత



రెవెన్యూ అధికారులకు తగు సూచనలు చేస్తున్న ఆర్డీఓ హేమలత

పాచిపెంట: సర్వే పూర్తయిన భూములకు సర్వే రాళ్లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత అన్నారు. జగనన్న భూరక్ష – భూహక్కు రీసర్వేలో భాగంగా పాచిపెంట మండలం గార్లవలస, కేసలి, ఆలూరు గ్రామాల్లో సర్వేరాళ్ల ఏర్పాటును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వే రాళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంగం రాజశేఖర్, సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావును సత్కరిస్తున్న ఎంఈఓలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యయుడు కొల్లి ఈశ్వరావును, రొంపల్లి క్లస్టర్ సీఆర్‌టీగా పనిచేసి బదిలీపై వెళ్లిన కె.చిన్నమ్మలను ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య బుధవారం సత్కరించారు. విధి నిర్వహణలో భాగంగా వారు అందించిన సేవలను గుర్తించి సత్కరించారు. భవిష్యత్‌లో కూడా మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కొట్టక్కి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు, సీఆర్టీలు బొప్పే సురేష్ కుమార్, ఎం.రవికుమార్, శ్రీనివాసరావు, వెంకటేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



అర్తాం రహదారి వద్ద మరమ్మతులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

కొమరాడ: పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో బుధవారం అర్తాం గ్రామ సమీపంలో పెద్ద గొయ్యిని ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టగా పనులను కలెక్టర్ నిషాంత్‌కుమార్ పరిశీలించారు. పనులను నాణ్యతతో చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

గంజాయి రవాణాపై నిఘా



రేగిడి: బూరాడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రేగిడి, రాజాం సిటీ: గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల తరలింపుపై అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. మండలంలోని పారంపేట గ్రామానికి చెందిన ఓ విద్యార్థి గంజాయి తరలిస్తూ పట్టుబడిన విషయం విధితమే. అప్రమత్తమైన పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఎస్‌ఈబీ ఎస్పీ అస్మా ఫర్హీన్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం బూరాడ, కొత్తపేట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఈబీ ఎస్సై పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి భాగస్వాములవుదాం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



నాభూమి నాదేశం కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్:

దేశ భక్తి, ఐకమత్యంతో అభివృద్ధిలో ప్రతిఒక్కరం భాగస్వామ్యం అవుదామని కలెక్టర్ నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని ఎంఎన్ పల్లె గ్రామ పంచాయతీలో బుధవారం నిర్వహించిన 'నా నేల–నా దేశం, 'నేల తల్లికి నమస్కారం -వీరులకు వందనం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి కలెక్టర్ నిషాంత్‌కుమార్ పాల్గొన్నారు. దేశం కోసం పోరాడిన త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రగతి యువతతోనే సాధ్యమని, మాతృ భూమి రుణం తీర్చుకునేందుకు దేశాభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మట్టి ప్రమిదలు వెలిగించి ఐకమత్యంతో అభివృద్ధి సాధిద్దామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామ సచివాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. 'నా నేల–నా దేశం, 'నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం' కార్యక్రమం ఆగస్టు నెలాఖరు వరకు జరుగుతుందని, వివిధ కార్యక్రమాలను ఈ సందర్భంగా చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించాలని కోరారు. గ్రామానికి, దేశానికి సేవ చేసిన వారిని గౌరవించి, సత్కరించడం వంటి కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్మీ హవల్దార్ బి.సురేష్ కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, ఎంపీపీ మజ్జి శోభారాణి, సర్పంచ్ వంగపండు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సత్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎమ్మెల్యే జోగారావు

గ్రామాల్లో అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి



గెడ్డలుప్పిలో భవనానికి వేస్తున్న శ్లాబ్‌ను పరిశీలిస్తున్న డీఈ రత్నకుమార్

- పీఆర్ డీఈ రత్నకుమార్

సీతానగరం:

రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల నిధులతో మంజూరు చేసిన భవనాలు, కల్వర్టులు, కాలువలు, సీసీ రోడ్డు పనులను నిర్దేశించిన గడువులోగా నిర్వాహకులు పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డిఈ ఎం.రత్నకుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం అయన మండలంలోని గెడ్డలుప్పిలో ఆర్బీకే భవనం, సచివాలయ భవనం పనులు, నీలకంఠాపురం, వెంకటాపురం గ్రామాల్లో సీసీడ్రైన్స్, సీసీ రోడ్డు పనులు ఏఈ చంద్రమౌళితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గెడ్డలుప్పిలో మాట్లాడుతూ పార్వతీపురం, బలిజిపేట, సీతానగరం మండలాల్లోని గ్రామాల్లో జరుగుతున్న భవన నిర్మాణాలను నిర్వాహకులు, కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. గడపగపడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెంకటాపురంలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు, కాలువ పనులు, నీలకంఠాపురంలో రూ.6 లక్షలతో నిర్మిస్తున్న సీసీ కాలువ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గెడ్డలుప్పి సర్పంచ్ అల్లు తిరుపతిరావు, వెంకటాపురం సర్పంచ్ బి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు వెంకటలక్ష్మి, మోహనరావు, సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనకే 'మిషన్ ఇంద్రధనుస్సు'

కొమరాడ:

వ్యాధి నిరోధక టీకాల నిర్వహణను బలోపేతం చేసి తట్టు, రుబెల్లా తదితర వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలించడమే మిషన్ ఇంద్రధనుస్సు ఉద్దేశమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని సోమినాయుడువలసలో మిషన్ ఇంద్రధనుస్సు టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. టీకా అర్హుల జాబితా వివరాలు, ఏఏ టీకాలు వేశారో పరిశీలించారు. ఈ వివరాలను వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తి స్థాయి టీకాలు వేయబడిన పిల్లలకు టీకా ధ్రువపత్రాన్ని అందజేశారు. శనివారం వరకు మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం స్వాతిముత్యం, సీహెచ్‌వో జయంతి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.



సోమినాయుడువలసలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐవో డాక్టర్ జగన్మోహనరావు

నేడు డీవార్మింగ్ డే

పార్వతీపురం: నులిపురుగుల నివారణ మందును 1–19 ఏళ్ల వయస్సున్న వారందరికీ గురువారం అందించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1–2 ఏళ్ల వయస్సుగల 19,106 మందికి సగం మాత్ర, 2–19 ఏళ్లుగల 1,71,332 మందికి ఒక మాత్ర చొప్పున పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలద్వారా పంపిణీ చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. నులిపురుగుల నివారణకు మాత్రల పంపిణీతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలని చెప్పారు. చేతులు కడుక్కునే విధానాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని స్పష్టం చేశారు.

నిబంధనలు పాటించాలి

పాలకొండ: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఏలాం సెంటరులో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు అందించిన వారిపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

గరుగుబిల్లి: మొక్కలతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలమని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన చెరువు గట్టుపై బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చెరువు గట్టుపై పలు రకాల మొక్కలు నాటారు. నాటిన మొక్కల పరిరక్షణకు చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలన్నారు. సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, వైస్సార్ క్రాంతి పథం ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, ఉపాధి పథకం ఏపీవో ఎం.గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు రోగ నిరోధక టీకాలు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో చిన్నారులకు రోగ నిరోధక టీకాలు బుధవారం వేశారు. ఏఎన్‌ఎం కుమారి, ఎంపీహెచ్‌వో ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 0 నుంచి 5ఏళ్లలోపు చిన్నారులకు టీకాలు వేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైతుల కల్పతరువు.. వెంకమ్మ చెరువు



నిండుకుండలా ఉన్న వెంకమ్మ చెరువు

> **చెరువులో ఆక్రమణలు తొలగిస్తాం**
>
> ప్రస్తుతం చేపడుతున్న భూ సర్వే ద్వారా చెరువు గర్భాన్ని గుర్తిస్తాం. ఈ ఖరీఫ్ సీజన్ అయిపోయిన తర్వాత చెరువులో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపడతాం. చెరువు గర్భాలను ఎవరైనా ఆక్రమించుకుంటే శాఖాపరమైన చర్యలు చేపడతాం.
>
> – చందక సత్యనారాయణ, తహసీల్దార్, వీరఘట్టం

- ఏడాదికి మూడు పంటలు
- ఖరీఫ్‌లో 600 ఎకరాల్లో సాగు
- చెరువులో ఆక్రమణలు తొలగిస్తే పెరగనున్న సాగు విస్తీర్ణం

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రోడ్డులో మరియగిరి సమీపంలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వెంకమ్మ చెరువు ఆయకట్టు రైతులకు కల్పతరువుగా మారింది. ఖరీఫ్‌లో రైతులకు సాగు నీరందిస్తూ పంట పొలాలను సస్యశ్యామలం చేస్తోంది. ప్రస్తుతం వెంకమ్మపేట, జోగిమ్మపేట, చిదిమి, పాలమెట్ట రైతులు వెంకమ్మ చెరువు ఆయకట్టులో సుమారు 600 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. మండలంలో చాలా చోట్ల ఇంకా దమ్ములు అవుతున్నా... వెంకమ్మ చెరువు ఆయకట్టు రైతులు మూడు రోజుల క్రిందటే ఉభాలు పూర్తి చేసేశారు. ఉభాలు పూర్తి కావడంతో పుడమి తల్లికి పచ్చాని రంగేసినట్లు ఇక్కడ వాతావరణం అలరిస్తోంది.

ఇదీ పరిస్థితి

మండలంలో సుమారు 250 చెరువులు ఉన్నాయి. వీటిలో 70 శాతం ఆక్రమణలకు గురయ్యాయి. ఈ చెరువులు ఏ కాలంలో కూడా సాగుకు ఉపయోగపడటం లేదు. మిగిలిన 30 శాతం చెరువులు ఖరీఫ్‌లో వరి పంటకు నీరు అందిస్తున్నాయి. అయితే రబీలో మాత్రం సాగుకు నీరందించే పరిస్థితుల్లో ఈ చెరువులు లేవు. వెంకమ్మ చెరువు మాత్రం నిండు కుండలా అన్ని కాలాల్లోను ఉంటుంది. దీంతో ఏడాదంతా వెంకమ్మ చెరువు ఆయకట్టు సస్యశ్యామలంగా ఉంటోంది.

ఆక్రమణలు తొలగిస్తే మేలు

సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వెంకమ్మ చెరువు వీరఘట్టం, చిదిమి పంచాయతీ పరిధిలో ఉంది. అయితే ప్రస్తుతం చెరువు 50 శాతం ఆక్రమణలకు గురై 100 ఎకరాలు ఉండవచ్చునని పలువురు వాపోతున్నారు. చెరువు ఆక్రమణలు తొలగిస్తే మరో 500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుందని రైతులు అంటున్నారు.



వెంకమ్మ చెరువు దిగువ భాగంలో పొలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

సుభద్రలో 6వ వార్డుకు నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి సింహాచలం



లచ్చయ్యపేటలో నామినేషన్ స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి పవన్‌కుమార్

బలిజిపేట: మండలంలోని సుభద్ర పంచాయతీలో 6వ వార్డు అభ్యర్థిగా గొంగాడ సింహాచలం బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి ఈఓపీఆర్‌డీ రవికి నామినేషన్ పత్రాలు అందజేశారు. గ్రామ పెద్ద గంట సింహాచలం ఆయనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో ఒకే నామినేషన్

సీతానగరం: మండలంలోని రెండుగ్రామాల్లో ఖాళీ అయిన మూడు వార్డు మెంబర్ల ఉపఎన్నికకు నామినేషన్ల స్వీకరణ బుధవారం జరిగింది. ఈ మేరకు లచ్చయ్యపేటలో 6వ వార్డుకు ఉపఎన్నిక జరుగనున్నందున అదే వార్డులో ఉన్న బి.గౌరీవర ప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారని ఎన్నికల అధికారి ఆర్ పవన్‌కుమార్ తెలియజేశారు. వార్డు మెంబర్ ఎన్నికను ఏకగ్రీవం చేయడానికి గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకులు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే జోగింపేటలో రెండు వార్డులకు జరగాల్సిన ఉప ఎన్నికలకు సంబదించి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎన్నికల అధికారి కె.కుమారవర్మ తెలియజేశారు.

గ్రామాల్లో ఘనంగా నేలతల్లికి వందనం



నా భూమి నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న నాభూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బల్లకృష్ణాపురం, సూరంపేట పంచాయతీ, చిన్నారాయుడుపేట గ్రామాల్లో ఉపాధిహామీ పథకం అధికారుల ఆధ్వర్యంలో నేలతల్లికి వందనం, అమర వీరులకు జోహార్లు కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్నిగ్రామాల్లో అభివృద్ధి చేసిన అమృత్ సరోవర్ ప్రాంతాల్లో నేల తల్లికి పూజలు నిర్వహించడమేకాకుండా దేశసేవలో అమరులైన వీరులకు జోహార్లు అర్పించామని చెప్పారు. కార్యక్రమంలో బల్లకృష్ణాపురం, సూరంపేట సర్పంచ్‌లు ఎన్ సుశీల, సీహెచ్ అప్పలనర్సమ్మ, సాంబందొర, మాజీ సీసీడీ చైర్మన్ ఎన్.రామకృష్ణ, ఎంపీటీసీలు బి.వరలక్ష్మి, వై.గౌరీశ్వరి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ భాను, జేఈ కృష్ణ, టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గిరిజనుల ఐక్యత వర్ధిల్లాలని కోరుతూ నినాదాలు చేస్తున్న గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు

పాచిపెంట: మండలంలోని గొట్టూరు పంచాయతీ చాపరాయివలసలో సర్పంచ్ మాదల సింహాచలం, ఎంపీటీసీ సభ్యురాలు చదల అంజలి ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.

గిరిజన ఆచార, సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన హక్కుల పరిరక్షణకై గిరిజనులంతా రాజీలేని పోరాటాన్ని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి సంఘాల సమైక్య అధ్యక్షుడు పడాల తమ్మయ్య , ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: ఇతర రాష్ట్రాల్లో లేని పాఠశాలల అభివృద్ధి పథకాన్ని మన రాష్ట్రంలో ప్రవేశపెట్టారని పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యాశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో నాడు–నేడు పనుల పురోగతి, బడిబయట పిల్లలు, పుస్తకాలు, బూట్ల పంపిణీ, హాజరు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు తెరచి నెలరోజులు దాటిపోయినప్పటికీ పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పనులు పూర్తి చేసి చక్కని మౌలిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు.

నిధులు, మెటీరియల్ అందుబాటులో ఉన్నప్పటికీ పనులు జరగకపోతే అధికారులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాడు–నేడు పథకంలో మొదటి విడత, రెండవ విడత పనులు చేపట్టిన పాఠశాలలే కాకుండా మిగిలిన 566 పాఠశాలల్లో మంచినీరు, టాయిలెట్స్, ఎలక్ట్రికల్ పనులను చేపట్టేందుకు అంచనాలను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకూ అమ్మఒడి

రామభద్రపురం:

సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకూ ప్రభుత్వం అమ్మఒడి పథకం మంజూరు చేస్తోందని ఏఎస్‌డబ్ల్యూఓ డీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక సాంఘిక బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహం ఆవరణం, మరుగుదొడ్లు, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో 5 ప్రీమెట్రిక్, 4 పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయని, వాటిలో 20 నుంచి 30 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కాస్మోటిక్ చార్జీలను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతీరోజూ నాణ్యమైన భోజనంతో పాటు సాయంత్రం స్నాక్స్ కింద వివిధ రకాల తినిబండారాలు అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.